క్లుప్తంగా

నూతన కార్యవర్గం

బెజ్జంకి(సిద్దిపేట): కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి సూచన మేరకు పార్టీ దూల్మిట్ట మండల కార్యవర్గాన్ని ఆదివారం నియమించినట్లు మండల అధ్యక్షుడు కోల సాయిలు గౌడ్ తెలిపారు. మండల ఉపాధ్యక్షులుగా నాగిల్ల బుచ్చిరెడ్డి, బూర గంగాధర్, మంద శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా గద్దల మహేందర్, కార్యదర్శిగా కత్తెర నర్సింహాచారి, కోశాధికారిగా లకావత్ కిషన్, చల్ల మాధవరెడ్డి, పలువురు కార్యవర్గసభ్యులుగా నియమితులయ్యారు.

ఆర్థిక సహాయం అందజేత

కోహెడరూరల్(హుస్నాబాద్): మండలంలోని శ్రీరాములపల్లి గ్రామానికి చెందిన ప్రముఖ న్యాయవాది కోడముంజ సత్తయ్య ఇటీవల మరణించాడు. ఆయన కుటుంబానికి వినాయక లా కళాశాల వైస్ ప్రిన్సిపాల్ రవీంద్ర ప్రసాద్, సత్తయ్య సహవిద్యార్థులు రూ.46 వేలు అందించారు. కార్యక్రమంలో అహ్మద్ అలి, సాగర్, సాయినాథ్ సాగర్, రాజేష్, సుమన్, శివశంకర్, చందు,శంకర్ పాల్గొన్నారు.

కళాకారులకు డప్పుల అందజేత



దప్పులను అందజేస్తున్న అంక్షారెడ్డి

వర్గల్(గజ్వేల్): వర్గల్, శాకారం గ్రామాల డప్పు కళాకారులకు ఆదివారం మాజీ ఉపసర్పంచ్, కాంగ్రెస్ నాయకుడు పసుల రమేశ్ తన తండ్రి పోచయ్య జ్ఞాపకార్థం డప్పులను జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు అంక్షారెడ్డి చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా రమేశ్ మాట్లాడుతూ మండల కేంద్రంలో పేద ఆడపడచుల వివాహానికి బంగారు పుస్తెలు, వెండి మెట్టెలు అందజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో జాల మల్లారెడ్డి, పొన్నాల రాజశేఖర్‌రెడ్డి, గణేష్, ఎల్లయ్య పాల్గొన్నారు.

యువకుడికి సన్మానం

మిరుదొడ్డి(దుబ్బాక): మండల కేంద్రమైన మిరుదొడ్డికి చెందిన యువకుడు చిన్నగల్ల నాంపల్లి ఇటీవల ప్రభుత్వ జూనియర్ కళాశాల విభాగంలో ఫిజికల్ డైరెక్టర్‌గా ఉద్యోగం సాధించాడు. ప్రభుత్వ ఉద్యోగం సాధించడంపై హర్షం వ్యక్తం చేస్తూ డీఎస్పీ, జిల్లా మాదిగ జాగృతి సంఘం జిల్లా నాయకులు ఆదివారం నాంపల్లితోపాటు అతడి తల్లిదండ్రులు యాదమ్మ, నర్సింహులును సన్మానించారు. కార్యక్రమంలో డీఎస్పీ జిల్లా ఉపాధ్యక్షుడు చందు, మాదిగ జాగృతి సంఘం జిల్లా నాయకులు రాజన్ మహారాజ్, మల్లికార్జున్, లక్ష్మణ్, దీపక్, కరుణాకర్, రవి తదితరులు పాల్గొన్నారు.

వైద్యఖర్చులకు ఆర్థిక సాయం

గజ్వేల్‌రూరల్: అనారోగ్యంతో బాధపడుతున్న బాలుడికి తలకొక్కుల చంద్రకళ-లక్ష్మణ్ చారిటబుల్ ట్రస్ట్ చేయూత అందించింది. గజ్వేల్ మండలం గిరిపల్లికి చెందిన ఆటో మెకానిక్ ఎంకమొల్ల స్వామి చిన్న కుమారుడు ప్రణీత్(8) కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నాడు. ఈ విషయం తెలుసుకున్న ట్రస్ట్ సభ్యులు ఆదివారం గిరిపల్లి వచ్చి ప్రణీత్ ఆరోగ్య వివరాలు తెలుసుకొని రూ.10 వేల నగదు అందజేశారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు దుర్గాప్రసాద్, సతీష్, గ్రామస్తులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్‌కు పరామర్శ

దుబ్బాక: దుబ్బాక మండలం చీకోడ్ గ్రామ మాజీ సర్పంచ్ తౌడ శ్రీనివాస్ తల్లి ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి ఆదివారం సాయంత్రం శ్రీనివాస్‌ను పరామర్శించి సంతాపం తెలిపారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ రవీందర్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బాణాల శ్రీనివాస్, పల్లె వంశీకృష్ణాగౌడ్, సంగం ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



2004-05 బ్యాచ్ విద్యార్థులు

చిన్నకోడూరు(సిద్దిపేట): మండల పరిధిలోని అల్లీపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2004-05లో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం పాఠశాలలో ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఎన్నో ఏళ్ల తర్వాత కలుసుకోవడంతో ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. యోగక్షేమాలు అడిగి తెలుసుకొని, చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. తమకు విద్యాబుద్ధులు చెప్పిన గురువులను సత్కరించారు. రోజంతా ఆట పాటలతో సందడి చేశారు.

హరిహరా.. ఇదేమి గోస

- వర్షాలకు రోడ్లన్నీ బురద మయం
- నిలిచిన నీటిలో దోమల వృద్ధి
- సర్వీసు రోడ్డులేక కాలనీవాసులకు ఇక్కట్లు
- తరచూ విద్యుత్ సరఫరాలో అంతరాయం
- సమస్యలు పరిష్కరించాలని వినతి



బురదమయంగా మారిన హరిహర రెసిడెన్సీ కాలనీలోని రోడ్డు

సిద్దిపేట పట్టణంలో తొలి రెసిడెన్షియల్ కాలనీ. సిద్దిపేట, మిట్టపల్లి గ్రామాల మధ్య 2005లో హరిహర రెసిడెన్షియ కాలనీ ఏర్పడింది, 2006 నుంచి కాలనీలో ప్రజలు నివాసం ఉంటున్నారు. అప్పట్లో ఇదే పేరున్న కాలనీ. కాలనీ సమస్యలను పట్టించుకోకపోవడంతో కొంతమంది తమ ఇళ్లను అమ్ముకున్నారు. ఇప్పుడు ఈ కాలనీలో 138 ఇళ్లు ఉన్నాయి. దాదాపు 500 మంది జనాభా ఉంది. ప్రారంభంలో మిట్టపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో ఉంది. కొన్నేళ్ల క్రితం సిద్దిపేట మున్సిపాలిటీలో కలిసింది.

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): సిద్దిపేట పట్టణం, హరిహర రెసిడెన్షియల్ కాలనీని రాజీవ్ రహదారి వేరు చేస్తుంది. దీంతో ఈ కాలనీకి వెళ్లాలంటే కాలనీ వాసులు భయపడుతుంటారు. వేగంగా వస్తున్న వాహనాలను జాగ్రత్తగా గమనిస్తూ, బతుకు జీవుడా అంటూ రాజీవ్ రహదారిని దాటాల్సి వస్తోంది. గతంలో ఈ కాలనీకి చెందిన అనేక మంది రోడ్డు దాటుతూ ప్రమాదాలబారినపడ్డారు. హరిహర రెసిడెన్సీ కాలనీకి సర్వీస్ రోడ్డు నిర్మిస్తే ప్రమాదాలకు అడ్డకట్ట వేయొచ్చని కాలనీ వాసుల అభిప్రాయం. గతంలో అనేక మంది అధికారులు, ప్రజాప్రతినిధులు హామీలు ఇచ్చినప్పటికీ నీటి మూటలుగానేమారాయని అసహనం వ్యక్తం చేస్తున్నారు. కాలనీలో విద్యుత్ లైన్ల కిందనే మొక్కలను నాటడంతో బలమైన గాలి వీచినప్పుడు విద్యుత్ వైర్లకు కొమ్మలు తగిలి విద్యుత్ సరఫరా నిలిచిపోతోంది. కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలతో కాలనీ మొత్తంగా బురదమయంగా మారింది. దీంతో వర్షపు నీరు నిలవడంతో దోమలు వృద్ధి చెందుతున్నాయి. ఉద్యోగులు కార్యాలయాలకు, పిల్లలు పాఠశాలలకు, కళాశాలలకు, వ్యక్తిగత పనుల నిమిత్తం బయటకు వెళ్లాలంటే కాలనీ వాసులు బెంబేలెత్తుతున్నారు. మున్సిపల్ అధికారులు స్పందించి కాలనీ సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నారు.

సీసీ రోడ్డు వేయాలి



మా కాలనీకి వచ్చే ప్రధాన రహదారి సక్రమంగా లేకపోవడంతో కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. కాలనీ రోడ్లు బురదమయంగా మారాయి. దీంతో కాలనీ నుంచి బయటకు అడుగుపెట్టాలంటే సాహసం చేయాల్సిందే. ముఖ్యంగా వృద్ధులు, మహిళలు, చిన్నారులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. దీంతో పాటుగా కాలనీలో దోమలు వ్యాప్తితో అనారోగ్య సమస్యలు వస్తున్నాయి. మున్సిపాలిటీ అధికారులకు విన్నవించినా పట్టించుకోవడంలేదు.

–లింగమూర్తి కురుమ, హరిహర రెసిడెన్సి కాలనీ

సమస్యలను పరిష్కరించాలి



హరిహర రెసిడెన్సీ కాలనీలో నేను 2007 నుంచి నివాసం ఉంటున్నాను. ఈ కాలనీకి రావాలంటే రాజీవ్ రహదారిని దాటుకొని రావాలి. దీంతో భయం భయంగా ప్రధాన రహదారిని దాటాల్సి వస్తోంది. కాలనీకి రాజీవ్ రహదారి వెంట సర్వీస్ రోడ్డు నిర్మిస్తే కాలనీ వాసులకు మేలు జరుగుతుంది. అదే విధంగా కాలనీ సమస్యలను పరిష్కరించేందుకు అధికారులు చొరవ చూపాలి.

– కొల్పుల రాములు, ఉపాధ్యాయుడు, హరిహర రెసిడెన్సి కాలనీ

ఉచిత వైద్యసేవలు అభినందనీయం



మందులు అందజేస్తున్న వైద్య సిబ్బంది

మిరుదొడ్డి(దుబ్బాక): సామాజిక సమరసత వేదిక, చేతన గ్రామీణ వికాస సేవా సమితి సంయుక్త ఆధ్వర్యంలో మండల పరిధిలోని అందెలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. అనారోగ్యంతో బాధపడుతున్న వారికి వైద్య పరీక్షలు నిర్వహించారు. అలాగే నేత్ర పరీక్షలు చేసి ఉచితంగా కంటి అద్దాలను అందజేశారు. కార్యక్రమంలో సమరసత వేదిక రాష్ట్ర కన్వీనర్ అప్పాల ప్రసాద్, రాష్ట్ర అధ్యక్షుడు ఆకుల నరేష్‌బాబు, గౌరవ అధ్యక్షుడు విజయ్ భాస్కర్, చిన్న పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ సాయినాథ్ రెడ్డి, డాక్టర్ రాజేష్ కుమార్, సురేష్‌రెడ్డి, సంపత్‌కుమార్, స్రవంతి, సమరసత వేదిక ప్రతినిధులు సుమన్, కనకయ్య, పోచయ్య, మహేష్, పవన్, సంతోష్, రుక్మిణి తదితరులు పాల్గొన్నారు.

ముత్యంపేటలో..

తొగుట(దుబ్బాక): మారుమూల గ్రామీణ ప్రజలకు చేతన గ్రామీణ వికాస సమితి అందిస్తున్న సేవలు అభినందనీయమని సామాజిక సమరసత వేదిక రాష్ట్ర కన్వీనర్ అప్పల ప్రసాద్ అన్నారు. మండలంలోని గోవర్ధనగిరి మదిర చిన్న ముత్యంపేట (పిట్టలవాడ) గ్రామంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అవగాహన లేకపోవడంతో పేదలు అనేక వ్యాధుల బారినపడి మరణిస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. గ్రామంలో ఏటా ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటుచేసి వైద్యసేవలందించడం గొప్ప విషయమన్నారు. శిబిరంలో నేత్ర పరీక్షలు చేసి మందులు, కంటి అద్దాలు అందజేశారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి కార్పొరేట్ ఆసుపత్రుల్లో ఉచితంగా వైద్యం అందిస్తామని వైద్యులు తెలిపారు. గ్రామంలోని విద్యార్థులు దూర ప్రాంత పాఠశాలలకు వెళ్లి చదువుకుంటున్న ఆరుగురు విద్యార్థులకు సైకిళ్లను అందజేశారు. కార్యక్రమంలో వేదిక జిల్లా గౌరవ అధ్యక్షుడు డాక్టర్ అరవింద్, ఉపాధ్యక్షుడు విజయభాస్కర్, వైద్యులు సాయి, శిరీష, అర్జున్, సందీప్, సాయినాథ్‌రెడ్డి, వేదిక ప్రతినిధులు రాజశేఖర్‌రెడ్డి, సంతోష్, యాదగిరి, రుక్మిణీ పాల్గొన్నారు.

విద్య, వైద్యం, ఉపాధిని విస్మరించిన ప్రభుత్వం



మాట్లాడుతున్న ధర్మ సమాజ్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు చందు

మిరుదొడ్డి(దుబ్బాక): కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో విద్య, వైద్యం, ఉపాధిని విస్మరించిందని ధర్మ సమాజ్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు ర్యాగట్ల చందు విమర్శించారు. ఆదివారం మిరుదొడ్డిలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే సంక్షేమ పథకాలతో గట్టెక్కుతామని నమ్మిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల ఆశలు అడియాశలయ్యాయన్నారు. అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతి కోసం అరకొర నిధులను బడ్జెట్‌లో కేటాయించి పాలన ఎలా సాగిస్తారని ప్రశ్నించారు. కార్యక్రమంలో డీఎస్పీ జిల్లా కార్యదర్శి పెద్దమాతరి లక్ష్మణ్, మండల అధ్యక్షుడు ఎర్రోల్ల దీపక్, ఉపాధ్యక్షుడు ధర్మారం రవి, మండల నాయకులు దయాకర్, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

రైతుబీమాకు దరఖాస్తు చేసుకోండి

కోహెడరూరల్(హుస్నాబాద్): అర్హులైన రైతులు రైతుబీమా చేయించుకోవాలని ఏఈఓ శివకుమార్ అన్నారు. ఈనెల 28వ తేదీ వరకు పట్టాదారు పాస్ పుస్తకం పొందిన రైతులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తుకు 28 నుంచి 59 ఏళ్ల వయస్సుగల రైతులు ఆగస్టు 5 వరకు అవకాశం ఉందన్నారు. దరఖాస్తుకు రైతులు తమ ఆధార్‌కార్డు, పట్టాదారు పాస్ పుస్తకం, నామిని ఆధార్ కార్డు జత చేయాలన్నారు.

రోడ్డుపై కూలిన చెట్టు



ధర్మాజిపేటకు వెళ్లేదారిలో కూలిన చెట్టు

దుబ్బాకటౌన్: రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షానికి దుబ్బాక నుంచి ధర్మాజీపేటకు వెళ్లే ప్రధాన రహదారిలో ఆదివారం ఉదయం మహావృక్షం కూలింది. రోడ్డుకు అడ్డంగా పడిపోవడంతో వాహనదారులు రాకపోకలు సాగించేందుకు నానా అవస్థలుపడ్డారు. విషయం తెలుసుకున్న ధర్మాజీపేట కౌన్సిలర్ దుబ్బాక బాలకృష్ణ గౌడ్ మున్సిపల్ సిబ్బంది సాయంతో కూలిన చెట్టును తొలగించారు.

సంక్షిప్త వార్తలు

◆ రోడ్డు మరమ్మతులు చేపట్టరా?

మిరుదొడ్డి(దుబ్బాక): నిధులు మంజూరైనా రోడ్డు మరమ్మతులు చేపట్టరా అంటూ అక్బర్‌పేట-భూంపల్లి మండల పరిధి మోతె మాజీ సర్పంచ్ కాలేరు శ్రీనివాస్ అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. దుబ్బాక మండలం చిట్టాపూర్-మోతె కమాన్ నుంచి కాసులాబాద్ మీదుగా మిరుదొడ్డి వరకు బీటీ మరమ్మతులకు గత ప్రభుత్వంలో రూ. 1.70 కోట్లు మంజూరయ్యాయన్నారు. అధికారుల పర్యవేక్షణ లేక కాంట్రాక్టర్లు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. రోడ్డు మరమ్మతులు చేయకపోవడంతో గుంతలమయంగా మారుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. గుంతల్లో నీరు నిలిచిపోవడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. బురద కారణంగా వాహనాలు అదుపు తప్పుతుండటంతో ప్రమాదాలు జరుగుతున్నాయని, అధికారులు వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

◆ కౌన్సిలర్ తల్లి మృతి

చేర్యాల(సిద్దిపేట): పట్టణ పరిధిలోని 3వ వార్డు కౌన్సిలర్ మంగోలు చంటి తల్లి పుష్ప ఆదివారం ఉదయం మృతి చెందింది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి వచ్చి కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. అంత్యక్రియల్లో పాల్గొన్న ఆయన బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఎర్రొల్ల శ్రీనివాస్‌తో కలిసి పాడె మోశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ అంకుగారి స్వరూపరాణి, వైస్ చైర్మన్ నిమ్మ రాజీవ్‌రెడ్డి, కౌన్సిలర్లు సతీష్, మాజీ ఎంపీపీలు కరుణాకర్, శ్రీధర్, నాయకులు బాల్‌నర్సయ్య, శ్రీధర్ రెడ్డి, అంజయ్య తదితరులు పాల్గొన్నారు. మాజీ ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి ఫోన్‌లో చంటిని పరామర్శించి ఓదార్చారు.

◆ వాహనదారుల నిరసన

చిన్నకోడూరు(సిద్దిపేట): పది రోజులుగా కురుస్తున్న వర్షాలకు రోడ్డంతా గుంతలమయంగా మారింది. వర్షపు నీరు నిలవడంతో ఈదారిపై రాకపోకలు సాగించడం కష్టంగా మారిందని వాహనదారులు, రైతులు అసహనం వ్యక్తం చేశారు. ఆదివారం చిత్తడి రోడ్డుపై వాహనదారులు సుమారు గంటసేపు నిరసన తెలిపారు. చిన్నకోడూరు నుంచి ఇల్లంతకుంటకు వెళ్లే రోడ్డు విస్తరణకు ఏడాది కింద బీటీ రోడ్డు తవ్వి వదిలేశారు. రెండు కిలోమీటర్ల మేర వర్షపు నీరు నిలవడంతోపాటు గుంతలు ఏర్పడ్డాయి. నిత్యం రద్దీగా ఉండే రోడ్డుపై తరుచూ వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని డిమాండ్ చేశారు.

◆ మిత్రుడికి చేయూత

వర్గల్(గజ్వేల్): కష్టాల్లో ఉన్న స్నేహితుడికి బాల్య మిత్రులు చేయూత అందించారు. వర్గల్‌కు చెందిన లక్ష్మణ్ నాలుగేళ్ల క్రితం రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. దీంతో అతడిని ఆదుకోవాలని వర్గల్ జెడ్పీహైస్కూల్‌లో 1993-94లో పదో తరగతి చదివిన విద్యార్థులు సంకల్పించారు. ఈ మేరకు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. అదే వేదికలో లక్ష్మణ్ దంపతులకు రూ.80 వేల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో నూర్ అహ్మద్, విష్ణువర్ధన్ రెడ్డి పాల్గొన్నారు.

అంజయ్యకు జీవన సాఫల్య పురస్కారం



సాహితీ వనం జీవన సాఫల్య పురస్కారం అందుకుంటున్న కొమురవెల్లి అంజయ్య

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ప్రముఖ కవి, సీనియర్ జర్నలిస్ట్ కొమురవెల్లి అంజయ్య తెలుగు సాహితీ వనం జీవన సాఫల్య పురస్కారం అందుకున్నట్లు కథల తాతయ్య ఎన్నవెల్లి రాజమౌళి తెలిపారు. ఆదివారం హైదరాబాద్ రవీంద్రభారతిలో తెలుగు సాహితీవనం సంస్థ 7వ వార్షికోత్సవం నిర్వహించారన్నారు. అంజయ్యను జిల్లా కవులు, రచయితలు, సాహితీ అభిమానులు, జర్నలిస్టులు, అభినందించారు.

కేంద్ర పథకాలను ప్రజలకు వివరించాలి



దుబ్బాకలో మన్ కీ బాత్ వీక్షిస్తున్న బీజేపీ నాయకులు

దుబ్బాక: మోదీ సర్కార్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను కార్యకర్తలు ప్రజలకు వివరించాలని బీజేపీ జిల్లా నాయకుడు కానుగంటి శ్రీనివాస్, దుబ్బాక అసెంబ్లీ కన్వీనర్ ఎస్ఎన్ చారి, మున్సిపల్ అధ్యక్షుడు సుభాష్‌రెడ్డి అన్నారు. ఆదివారం దుబ్బాకలో మన్‌కీ బాత్ కార్యక్రమాన్ని వీక్షించారు. అనంతరం వారు మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను నాయకులు, కార్యకర్తలు క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రజలకు తెలియజెప్పాలన్నారు. కార్యక్రమంలో కొండె ఎల్లారెడ్డి, భాస్కర్, బోయ రాజశేఖర్, ప్రవీణ్ కుమార్, సప్తగిరి, రమణారెడ్డి, కిషన్, రమేష్ పాల్గొన్నారు.

● బోనమెత్తిన విద్యార్థులు



బోనాలతో బాలికలు

దుబ్బాక టౌన్: ఆషాఢ మాసం పురస్కరించుకుని దుబ్బాకలోని ఓ పాఠశాలలో బోనాల ఉత్సవం నిర్వహించారు. విద్యార్థులు పోతరాజు వేషధారణలో అలరించారు. విద్యార్థినులు పాఠశాల నుంచి పోచమ్మ దేవాలయం వరకు డప్పుచప్పులతో బోనాలను ఊరేగింపుగా తీసుకెళ్లి అమ్మవారికి సమర్పించారు.

బెజ్జంకిలో..

బెజ్జంకి(సిద్దిపేట): ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో బెజ్జంకిలో పోచమ్మ, పెద్దమ్మ బోనాల ఉత్సవం నిర్వహించారు. మహిళలు బోనాలతో ఊరేగింపుగా ఆలయాలకు వెళ్లి అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించారు. వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండగా పండాలని ఏటా ఆషాఢ మాసంలో బోనాల ఉత్సవం నిర్వహిస్తామని సంఘం అధ్యక్షుడు పోచయ్య తెలిపారు.

పొట్లపల్లిలో..

హుస్నాబాద్‌రూరల్: హుస్నాబాద్ మండలం పొట్లపల్లి, కూచనపెల్లి గ్రామాల్లో ఆదివారం పోచమ్మ బోనాల ఉత్సవం నిర్వహించారు. ఆషాఢ మాసం పురస్కరించుకొని ఏటా గ్రామస్తులు వర్షాలు సమృద్ధిగా కురవాలని గ్రామ దేవతలకు బోనాలు సమర్పిస్తారు.

స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలి

రాష్ట్ర కిసాన్ మోర్చా కార్యదర్శి మైపాల్‌రెడ్డి



మాట్లాడుతున్న కరివేద మైపాల్‌రెడ్డి

కోహెడ(హుస్నాబాద్): రానున్న స్థానిక సంస్థల ఎన్నికలల్లో కాషాయ జెండా ఎగిరేలా కార్యకర్తలు కృషి చేయాలని రాష్ట్ర కిసాన్ మోర్చా కార్యదర్శి కరివేద మైపాల్‌రెడ్డి పిలుపు నిచ్చారు. ఆదివారం మండల కేంద్రంలో నిర్వహించిన బీజేపీ మండల స్థాయి కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. సమస్యల పరిష్కారంలో ప్రజలకు కార్యకర్తలు అండగా నిలవాలన్నారు. సమావేశంలో ఎనిమిది తీర్మానాలను ఏకగ్రీవంగా ఆమోదించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కోమటిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి, జన్నపురెడ్డి సురేందర్‌రెడ్డి, ఖమ్మం వెంకటేశం, నర్సయ్య, రమేష్, నరేశ్, దామోదర్, శ్రీనివాస్, రజనీకాంత్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, జగన్, లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో కూలీ మృతి



రోడ్డుపై పడిన కనకయ్య

చిన్నకోడూరు(సిద్దిపేట): రోడుప్రమాదంలో కూలీ మృతి చెందాడు. ఈ సంఘటన మండల పరిధిలోని చంద్లాపూర్ శివారులో ఆదివారం సాయంత్రం జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన గంగాధర కనకయ్య(62), భార్య వజ్రవ్వ, కుమారుడు, ఇద్దరు కూతుర్లు ఉన్నారు. కనకయ్య కూలీ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. కనకయ్య టీవీఎస్‌పై రామంచలోని తన కూతురును పరామర్శించి తిరిగి ఇంటికి వస్తున్నాడు. రంగనాయక సాగర్ కట్టపై బైక్ అదుపుతప్పి గేట్ పిల్లర్‌ను ఢీకొనడంతో కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన స్థానికులు అతడిని 108 అంబులెన్స్‌లో సిద్దిపేట ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షిస్తున్న క్రమంలో మృతి చెందాడు. మృతుడి కుమారుడు మహేందర్ ఫిర్యాదు కేసు నమోదు చేసినట్లు చిన్నకోడూరు పోలీసులు తెలిపారు.

నర్సింహారెడ్డి సేవలు మరువలేనివి



మద్దూరులో నివాళులు అర్పిస్తున్న సీపీఎం నాయకులు

మద్దూరు(హుస్నాబాద్): జనగామ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే ఏసీరెడ్డి నర్సింహారెడ్డి సేవలు మరువలేనివని సీపీఎం పార్టీ మద్దూరు మండల కార్యదర్శి ఆలేటి యాదగిరి అన్నారు. నర్సింహారెడ్డి 33వ వర్ధంతి సందర్భంగా మద్దూరు మండల కేంద్రంలో ఆదివారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఎం మండల కమిటీ సభ్యుడు ఎండీ షఫీ, నాయకులు పిడిశెట్టి సాయిలు, చిలక యాదగిరి, బాబు, సూర కనకరాజు, యాదగిరి, యాదయ్య, మురళి, ఎండీ సిరాజ్, తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శానికి మారుపేరు ..

కొమురవెల్లి(సిద్దిపేట): తెలంగాణ సాయుధ పోరాట యోధుడు, జనగామ మాజీ శాసన సభ్యుడు ఏసీరెడ్డి నర్సింహారెడ్డి ఆదర్శానికి మారుపేరని సీపీఎం మండల కార్యదర్శి శెట్టిపల్లి సత్తిరెడ్డి అన్నారు. ఆదివారం ఏసీరెడ్డి నర్సింహారెడ్డి 33వ వర్ధంతి సందర్భంగా మండల కేంద్రంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో నిజం సైన్యాలను ఎదిరించాడన్నారు. దున్నేవాడికి భూమి కావాలని నినదించాడన్నారు. పేదల విముక్తికోసం పోరాడిన వీరుడని కొనియాడారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు బద్దిపడగ కృష్ణారెడ్డి, తాడూరి రవీందర్, సాయిలు, బక్కెల్లి బాలకిషన్, ఆరుట్ల రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

చేర్యాలలో..

చేర్యాల(సిద్దిపేట): తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు, సీపీఎం నాయకుడు, జనగామ మాజీ ఎమ్మెల్యే దివంగత ఏసీరెడ్డి నరసింహారెడ్డి 33వ వర్ధంతిని ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. మండల కార్యదర్శి కొంగరి వెంకట్‌మావో ఆధ్వర్యంలో నాయకులు ఏసీరెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు అరుణ్ కుమార్, శ్రీహరి, మల్లేశం, చందు, ప్రవీణ్, రమేష్, శ్రీనివాస్, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.



కొమురవెల్లిలో..